క్లుప్తంగా

అన్నదానం పుణ్యకార్యం



కైలాసనగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

ఆరిలోవ: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం 11వ వార్డు కైలాసనగర్ కాలనీలో స్థానికులు అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి కార్యక్రమాన్ని ప్రారంభించి అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదానం పుణ్యకార్యమన్నారు. పవిత్రమైన కార్తీక మాసంలో అన్నసమారాధన చేపట్టిన నిర్వాహకులను మేయర్ అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, నిర్వాహకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులపై అవగాహన



కోర్సులపై అవగాహన కల్పిస్తున్న సూరిబాబు

ఆరిలోవ: బాలల హక్కుల వారోత్సవంలో భాగంగా ఆదివారం ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఒకేషనల్ కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంగమిత్ర సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు ఎ.సూరిబాబు గృహంలోని బాలురకు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫాబ్రికేషన్, వెల్డింగ్ తదితర కోర్సుల గురించి తెలియజేశారు. ఆయా కోర్సులను నేర్చుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం బాలురకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహం పర్యవేక్షణాధికారి కె.వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

21న రక్తదాన శిబిరం

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 21న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వివాహిత అదృశ్యం



సంతోషి లక్ష్మి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఓ వివాహిత అదృశ్యమైన కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. ఆరిలోవ అప్సరా కాలనీకి చెందిన గోకాడ సంతోషి లక్ష్మికి అదే ప్రాంతానికి చెందిన జి.చిన్నతో 18 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇంతవరకు పిల్లలు పుట్టలేదు. దీంతో ఆమె మానసికంగా అనారోగ్యానికి గురైంది. ఏడాది నుంచి మానసిక విభాగం వైద్యుల నుంచి మందులు వాడుతోంది. ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి చేరలేదు. బంధువులు, స్నేహితులను కుటుంబ సభ్యులు ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియరాదు. సంతోషి లక్ష్మి తండ్రి పి.జగన్నాథం ఆదివారం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంతోషి లక్ష్మి ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వృద్ధులకు వితరణ



వృద్ధులకు పండ్లు అందిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకొని స్థానిక శ్రీసత్యసాయి విద్యావిహార్ 10వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ఆరిలోవలోని అమ్మ–నాన్న ఓల్డేజ్ హోం, ఆర్టీసీ కాంప్లెక్స్ దరి ఆశ్రమ హోం ఫర్ ది హోంలెస్‌లలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, దుస్తులు, నిత్యావసర సరకులు అందజేశారు. విద్యావిహార్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల కాలం.. మహా ప్రసాదం



కొత్త వెంకోజీపాలెం అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద భిక్ష స్వీకరణకు తరలివచ్చిన స్వాములు

- 41 రోజుల పాటు మాలధారులకు అన్నదానం
- కొత్త వెంకోజీపాలెం అయ్యప్ప స్వామి ఆలయంలో ఏర్పాటు
- ప్రతి రోజూ 700 మందికి భిక్ష
- స్వాముల సేవలో తరిస్తున్న నిర్వాహకులు



మాలధారులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న భక్తులు



అలంకరణలో అయ్యప్ప



వంటకాలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

మద్దిలపాలెం: ప్రతి ఏటా కార్తీక మాసంలో వివిధ మాలలు ధరించిన భక్తుల సేవలో స్థానిక ఆలయ నిర్వాహకులు, వివిధ సంఘాల ప్రతినిధులు తరిస్తున్నారు. కార్తీకంలో దేవతామూర్తులకు పూజలు చేసేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు గాను దీక్షలు చేపడుతారు. వీటిని 41 రోజుల(మండల కాలం) పాటు నిష్టగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఉదయం కైకర్యం(అల్పాహారం), మధ్యాహ్నం భిక్ష(భోజనం) నియమాలు పాటిస్తూ భుజిస్తారు. దీని కోసం దీక్షాపరుల కుటుంబ సభ్యులు కూడా నియమ నిష్టలు పాటిస్తూ వంటకాలు చేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులకు ఇది కుదరకపోవచ్చు. అప్పుడు దీక్షాదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉచితంగా ఆహారాన్ని తూర్పు నియోజకవర్గంలో పలు చోట్ల అందిస్తున్నారు.

కొత్త వెంకోజీపాలెంలో 9 ఏళ్లుగా..

కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం వద్ద 9 ఏళ్లుగా మాలధారుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని దాతల సాయంతో నిర్వహిస్తున్నారు. ఈ ఆలయ సముదాయంలోనే ధర్మ శాస్తా అయ్యప్ప స్వామి దేవాలయం, సుబ్రహ్మణ స్వామి తదితర ఆలయాలు కొలువైయ్యాయి. అయ్యప్ప ఆలయ నిర్వాహకులు, గ్రామ సేవా సంఘం వారు 41 రోజుల పాటు దీక్షాపరులకు ఉచితంగా భిక్ష అందజేస్తున్నారు. అక్టోబర్ 27న ప్రారంభమైన ఈ కార్యక్రమం డిసెంబర్ 2 వరకు కొనసాగుతుంది. ప్రతి రోజూ సుమారు 700 మంది మాలధారులు ఇక్కడ అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. తొమ్మిదేళ్ల కిందట వరకు ఇక్కడ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం మాత్రమే ఉండేది. ప్రతి ఏటా అయ్యప్ప భక్తులు పెరుగుతూ రావడంతో గ్రామ సేవా సంఘం పూనుకుని తమ ప్రాంతంలో అయ్యప్ప ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించి అమలు చేశారు. ప్రతి ఏటా అయ్యప్ప భక్తులతో పాటు వివిధ మాలధారులకు కూడా 41 రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తూ వస్తున్నారు.

వివిధ ప్రాంతాల్లో..

నియోజకవర్గంలోని ఆరిలోవలో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా మాలధారులకు ఉచిత భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విశాలాక్షినగర్‌లోని కోదండరామ ఆలయ సముదాయంలో గురుస్వామి నాగరాజు ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం సుమారు 400 మంది పైగా మాలధారులకు అల్పాహారం ఇస్తున్నారు. చినవాల్తేరు సాయిబాబా మందిరంలో ప్రతి రోజు ఉదయం స్వాములకు ఉచితంగా అల్పాహారం అందిస్తున్నారు. భక్తుల కోరిక మేరకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా అయ్యప్ప, భవానీ, శివ మొదలగు మాలధారుల సేవలో నిర్వాహకులు తరిస్తున్నారు.

భక్తుల కోరిక మేరకు అన్నదానం



కొత్త వెంకోజీపాలెం సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి విచ్చేసే భక్తులు, గ్రామస్తులు కోరికపై, వారి సంకల్పంతో ఆలయ నిర్మాణం జరిగింది. ప్రతి ఏటా దీక్షాపరులకు అన్నదానం చేస్తూ ముందుకు సాగుతున్నాం. ఈ కార్యక్రమం ఎంతో మంది మాలధారులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి ఏటా క్రమం తప్పకుండా భక్తులతో మాలలు వేయిస్తున్నాం.

– బాల భాస్కరశర్మ, ఆలయ అర్చకుడు

21 సార్లు అయ్యప్ప మాల వేశా..



ప్రతి ఏటా క్రమం తప్పకుండా అయ్యప్ప మాల ధరిస్తున్నాను. ఇప్పటికీ 21 సార్లు మాల వేశాను. గ్రామస్తుల సహాయ సహకారాలతోనే భక్తితో కొలిచే అయ్యప్ప ఆలయాన్ని నిర్మించి అభివృద్ధి చేశాం. తద్వారా పలువురు దీక్షాపరులకు సేవ చేయడం చాలా ఆనందంగా ఉంది. మాలధారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏటా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.

– సూరిబాబు, గురుస్వామి, కొత్త వెంకోజీపాలెం

దాతలు ముందుకు రావాలి



కార్తీక మాసంలో మాలలు ధరించే స్వాముల కడుపు నింపడం వల్ల సహాయం అందించిన వారికి పుణ్యం లభిస్తుంది. దాతల సాయంతో ప్రతి ఏటా ఉచిత భిక్ష నిర్వహిస్తున్నాం. మా గురుస్వామి అడుగుజాడల్లో అనేక మంది భక్తులతో మాలలు ధరింపజేశాం. దాతలు ముందుకొచ్చి సాయమందిస్తే ఈ మహత్తర కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం.

– నాగరాజు, మాలధారుడు

గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళి



ఉద్యమకారుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎంవీపీ కాలనీ శాఖ లైబ్రరీలో గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్యల చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విశాఖ జిల్లా కేంద్ర గ్రంథాలయం మాజీ డిప్యూటీ లైబ్రేరియన్ కె.రాములు, మాజీ సీనియర్ అసిస్టెంట్ బి.ఆనందరావు మాట్లాడుతూ బాధ్యతాయుత సమాజాన్ని నిర్మించడంలో గ్రంథాలయ విజ్ఞానం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఇక్కడి విజ్ఞానాన్ని యువత ఒడిసిపట్టి భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎంవీపీ గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 20 వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. 18న చిత్రలేఖన పోటీలు, 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ముస్లిం చిన్నారులు

ఏయూక్యాంపస్: ఏయూ అవుట్ గేట్ డౌన్‌లో సందాని ఇస్లామిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హజరత్ మహబూబ్ సుబాని, గౌస్ పాక్ వారి గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అసర్ నమాజ్ అనంతరం ఖురాన్ పఠనం, సాయంత్రం పరిసర ప్రాంతాల్లో గౌస్ పాక్ వారి సందల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఊరేగింపు జరిపారు. గౌస్ పాక్ నిషా వద్ద సలాతు సలాం, ఫాతేహా, గౌస్ పాక్ జెండా ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో స్థానిక ముస్లింలు, చిన్నారులు పాల్గొన్నారు.


కైలాసగిరిపై జన జాతర



కైలాసగిరిపై సందడి చేస్తున్న సందర్శకులు

ఆరిలోవ: కార్తీక మాసంలో పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం నగరంలో ప్రముఖ పర్యాటక ప్రాంతం కైలాసగిరి సందర్శకులతో నిండిపోయింది. దీనిపై విశాలమైన పచ్చని మైదానాలపై నగరవాసులు వనభోజనాలు జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు కలిసి సరదాగా ఆటలాడుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. కైలాసగిరిపై తెలుగు మ్యూజియం, త్రీడీ థియేటర్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. శివపార్వతుల విగ్రహాలు, కైలాసరిగి వ్యూ పాయింట్, లవ్ సింబల్ వద్ద సందర్శకులు ఫొటోలు తీసుకున్నారు. ఎక్కువ మంది సందర్శకులు సర్క్యూట్ ట్రెయిన్‌లో కైలాసగిరి కొండ పైనుంచి నగరం అందాలనూ తిలకించారు.

45 ద్విచక్ర వాహనాల సీజ్



సీజ్ చేసిన వాహనాల వద్ద త్రీ టౌన్ ఎస్ఐలు సంతోష్, సురేష్

బీచ్‌రోడ్డు: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఈస్ట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 45 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. రేస్ బైక్‌లు, అధిక ధ్వని వచ్చే బైక్‌లు, నంబరు ప్లేట్ లేని బైకులు, స్కూటీలను సీజ్ చేసి మోటర్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. అధిక ధ్వని ఇచ్చే సైలెన్సర్లను బైక్‌ల నుంచి తొలగించారు. వాహన తనిఖీల్లో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు సంతోష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడు వితేశ్‌ను తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ సంతోష్

బీచ్‌రోడ్డు: పిక్నిక్ కోసం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి తప్పిపోయిన బాలుడిని వెతికి తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. జొన్నాడ గ్రామం నుంచి ఓ కుటుంబం మొత్తం ఆదివారం ఆర్కే బీచ్‌కు పిక్నిక్ కోసం వచ్చింది. అందరూ సముద్రం వద్ద సందడి చేస్తున్న సమయంలో ఆరేళ్ల బాలుడు వితేశ్ వారి నుంచి తప్పిపోయాడు. ఈ విషయాన్ని టూరిజం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వారు పోలీసు గ్రూప్‌లో సమాచారమిచ్చారు. త్రీ టౌన్ పోలీసులు తీరం మొత్తం జల్లెడ పట్టి బాలుడిని గుర్తించారు. ఎస్ఐ సంతోష్ వితేశ్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా సంతోష్ బృందాన్ని సీఐ రమణయ్య అభినందించారు.

కత్తితో దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు



రమేష్‌నాయుడి వీపుపై కత్తిగాటు



ఆస్పత్రిలో బాధితుడు రమేష్‌నాయుడితో మాట్లాడుతున్న ఎస్ఐ ఈశ్వరరావు

అనకాపల్లి: ఇళ్ల మధ్య గోడ విషయంలో జరిగిన ఘర్షణలో వై.రమేష్‌నాయుడిని అదే ప్రాంతానికి చెందిన బి.రాజా కత్తితో పొడిచినట్లు పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా.. విశాఖ మద్దిలపాలేనికి చెందిన వై.రమేష్‌నాయుడు కుటుంబ సమేతంగా అనకాపల్లి గవరపాలెంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఈయనకు గవరపాలెం గంగిరెగిచెట్టు వద్ద సొంతిల్లు ఉంది. ఆ పక్కనే ఉన్న బి.రాజా, ఇతడికి గోడ విషయంలో ఘర్షణ జరిగింది. రమేష్‌ను రాజా కత్తితో వీపుపై పొడిచాడు. రాజాతోపాటు సంతోష్, పూర్ణచంద్రరావు కూడా ఈ ఘర్షణలో ఉన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. అనకాపల్లి ఆస్పత్రిలో రమేష్‌నాయుడు చికిత్స పొందుతున్నాడు.

సాగర తీరంలో సండే సందడి





ఏయూక్యాంపస్: సాగర తీరం ఆదివారం జన సంద్రాన్ని తలపించింది. కార్తీక మాసం పిక్నిక్‌ల సీజన్ కావడంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు ఆర్కే బీచ్‌కు తరలి వచ్చారు. అక్కడి పరిసరాలన్నీ సందర్శకులతో నిండిపోయాయి. కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా సాగర తీరంలో గడిపారు. సముద్ర స్నానాలు చేస్తూ, గుర్రపు సవారీ, ఒంటెపై సవారీ, రంగుల రాట్నం వంటివి ఎక్కి చిన్నారులు ఎంజాయ్ చేశారు. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఫొటోలు తీసుకుంటూ పలువురు పదిలపరచుకున్నారు.

ఆటోలతో అవస్థలు





సాధారణంగా సెలవు రోజుల్లో బీచ్ రోడ్డులో వాహనాలను అనుమతించరు. ఆదివారం మాత్రం పదుల సంఖ్యలో ఆటోలు బీచ్ రోడ్‌లో సంచరించాయి. రోడ్డు పక్కనే వీటిని నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. పర్యాటకుల సంఖ్య అధికంగా ఉండటం, ఫుట్‌పాత్‌లు నిండిపోవడంతో ప్రజలు సైతం రోడ్డుపైనే నడిచారు. దీనితో పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయాలు ఏర్పడ్డాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఐఈఈఈ రిసోర్సెస్ వినియోగంపై అవగాహన



సదస్సుకు హాజరైన ఏయూ ఆచార్యులు, విద్యార్థులు



అవగాహన కల్పిస్తున్న ధను పట్టానశెట్టి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వి.ఎస్.కృష్ణా సెంట్రల్ లైబ్రరీలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో 'ఇంపార్టెన్స్ ఆఫ్ ఐఈఈఈ రిసోర్స్ ఇన్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఐఈఈఈ సీనియర్ క్లైంట్ సర్వీసెస్ మేనేజర్ ధను పట్టానశెట్టి ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సమావేశ మందిరంలో ఈ అవగాహన సదస్సు జరిగింది. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఐఈఈఈ రిసోర్సెస్ ఎంతగా ఉపయోగపడుతున్నాయో ఆయన వివరించారు. ఐఈఈఈ ద్వారా విస్తృత శ్రేణి జర్నల్స్, వాటి వినియోగం, సమాచారం మార్పిడి, నిపుణుల సలహాలు పొందవచ్చన్నారు. ఏయూ చీఫ్ లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వారోత్సవాల ద్వారా గ్రంథాలయాల విశిష్టతతోపాటు వాటి వినియోగంలోని సాంకేతిక అంశాలపైనా, పుస్తక విజ్ఞానం ఆవశ్యకతపైనా పెద్ద ఎత్తున విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. లైబ్రరీలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సదస్సు ప్రారంభిస్తున్న డాక్టర్ రాధాకృష్ణ

బీచ్‌రోడ్డు: పిల్లల్లో వినికిడి సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించాలని పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. జాతీయ నవజాత శిశువుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా ఆదివారం రామ్‌నగర్‌లోని గిగిల్స్ ఓమ్ని ఆస్పత్రిలో నియోనెంటాలజిస్టుల వైద్య విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టిన పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా వినికిడి సమస్యతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోందని తెలిపారు. అందువల్ల బిడ్డ పుట్టిన మూడో నెలలోపే వినికిడి పరీక్షలు చేయించాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 24 వరకు ప్రత్యేకంగా మూడు నెలల లోపు పిల్లలకు ఉచిత వినికిడి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ సందీప్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులను ఆక్రమించి పనులు



పిఠాపురం కాలనీ రోడ్డును పూర్తిగా ఆక్రమించి వేసిన భవన నిర్మాణ సామగ్రి



భారీ వాహనాల రాకపోకలతో కుంగిపోయిన కల్వర్టు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో కొన్ని రోడ్లు యూజీడీ పనులతో బ్లాక్ అయితే.. మరి కొన్ని భవన నిర్మాణ సామగ్రితో ఆక్రమణకు గురవుతున్నాయి. భవన నిర్మాణ సామగ్రి తరలింపునకు భారీ వాహనాలను వినియోగించడం వల్ల రహదారులపై గోతులు ఏర్పడటం, కల్వర్టులు కుంగిపోవటం వంటివి జరుగుతున్నాయి. పిఠాపురం కాలనీలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. కొందరు భవన నిర్మాణ యజమానులు రహదారులను పూర్తిగా సామగ్రితో నింపేసి పనులు చేయిస్తున్నారు. దీనితో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఆక్రమణలపై జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. రోడ్లపై వేసిన భవన నిర్మాణ సామగ్రిని తొలగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.